అతను తిరిగి రాయటం మొదలెట్టాడు. అతి ప్రమాదకరమైన ప్రకటన. ఆశపెట్టి యమపాశం బిగించే ప్రకటన కలల్ని రెచ్చగొట్టే ప్రకటన.... కలల్ని నిజం చేస్తామని నమ్మించే ప్రకటన... అతని చేతి రాతలో ఊపిరి పోసుకుంటోంది.

ఆ ప్రకటన రేపు తెచ్చిపెట్టబోయే కోట్ల రూపాయల నోట్ల దొంతరల్ని తలుచుకుంటూ మత్తులోకి జారుతున్నారు అక్కడున్న మిగతా మనుష్యులు.

అద్భుత ప్రపంచ విహారయాత్ర, లక్షలు ఖర్చుచేస్తేగాని పొందలేని విహారయాత్రానుభవాల్ని వేలలోనే మీకందించే అద్భుత పథకం-- నెలకు రెండువేలు చొప్పున రెండు సంవత్సరాలు చెల్లించాలి.

పన్నెండు వాయిదాలు సక్రమంగా చెల్లించినవా రికి పాస్‌పోర్టు, టూరిస్ట్ వీసాలన్నీ మేమే ఏర్పాటు చేయించి అమెరికా, కెనడా, ఇంగ్లాండ్, ఫ్రాన్స్, ఇటలీ మొదలగు యూరోపియన్ దేశాల్ని చూపిస్తాం. ఆ యాత్రలో మీకు మంచి వ్యాపారం తారసపడవచ్చు. ఇండియా రాగానే అది ప్రారంభించవచ్చు.

రిటైర్మెంట్ గురించి భయపడవద్దు. మీరు రిటైర్ అవ్వగానే మీకు యాభై వేలు వచ్చాయనుకోండి... వాటిని గ్యారంటి లేనిచోట్లో బందువులకో వడ్డీలకిచ్చి మొహమాటంతో మొత్తం పోగొట్టుకోవద్దు.

ఆ మొత్తాన్ని మా దగ్గర డిపాజిట్ చేస్తే 33 శాతం వడ్డీ ప్రతినెల ఠంచన్‌గా చెల్లిస్తాం? ప్రతి సంవత్సరం చివరి మొత్తంలో పది శాతం అసలుకు కలుపుతాం.

అంటే రెండో సంవత్సరం మీ ప్రారంభ నిల్వ 55,000. పది సంవత్సరాల చివర మీకు ఒకేసారి లక్ష రూపాయలు మీ డిపాజిట్‌ను తిరిగి తీసుకోవచ్చు.

ప్రత్తిపంట రైతులకిక ఆత్మహత్యలుండవు. సులభ వాయిదాల్లో దీర్ఘకాలిక వ్యవసాయ రుణాలు యిస్తాం. ఒక సంవత్సరపు పంట ఆదాయాన్ని మా వద్ద డిపాజిట్ చేసి వ్యవసాయ రుణాన్ని పొందే అర్హతను సంపాదించుకోండి.

పాడి పశువుల రుణాలు, జెర్సి జాతి ఆవులు మీ ఇంట సిరుల్ని పండిస్తాయి.

డెన్మార్క్ జెర్సి జాతి ఆవుల్ని, ఇతర క్రాస్‌బ్రీడ్ ఆవుల్ని యూరోపియన్ ఎకనామిక్ కమ్యూనిటి దేశాల్లో పాల మార్కెడ్ రేట్ పడకుండా వుంచుకునేందుకు చంపివేస్తున్నారు.

రవాణా ఖర్చులు భరించుకునే పద్ధతిలో మనదేశానికి ఉచితంగా వాటిని ఇస్తామని ప్రకటించారు. మావద్ద తమ పొదుపు మొత్తాన్ని డిపాజిట్ చేసే మా సభ్యులకు వాటిని కేవలం సగం రవాణా ఖర్చులకే అందిస్తాం.

నిరుద్యోగ భద్రతా ప్రణాళిక: చదువు మరో రెండు సంవత్సరాలలో పూర్తి కావస్తున్న విద్యార్థులు నెలకు రెండు వందల చొప్పున అన్ ఎంప్లాయ్ సెక్యూరిటీ డిపాజిట్ చెల్లిస్తే--వారికి ఉద్యోగం వచ్చేవరకు అయ్యే ఉద్యోగ ప్రయత్నాల ఖర్చులు మేమే భరిస్తాం.

సాధ్యమయినంతవరకు దేశవ్యాప్తంగా వున్న మా కంపెనీ కార్యాలయాల్లో అర్హతను బట్టి

ఉద్యోగం కల్పించే అవకాశం లేకపోలేదు.

రాసేవ్యక్తి కొద్దిక్షణాలు పాపభీతితో వణికిపోయాడు. రాస్తూ ఆగిపోయాడు---

ఈ డ్రాఫ్టు మూలంగా ఎన్ని వేల కుటుంబాలు నిలువునా కూలి పోనున్నాయో...ఎందరి ఆడపడుచుల పెళ్ళిళ్ళు ఆగిపోతాయో? ఎందుకు అప్పులపాలై పోతారో? మరెందరు ఆత్మహత్యలకు పాల్పడతారో... ?

"ఏం ఆగిపోయావేం? అయిపోయిందా?" మత్తుగా వస్తున్నాయి మధుమూర్తి నోటివెంట.

ఆ మాటలు రాబందు రెక్కల చప్పుడులా అనిపించాయి ఆ వ్యక్తికి. విషసర్పాల బుసలా వినిపించాయి. క్రూరమృగాల ఘీంకారంలా భయపెట్టాయి.

"అయినట్టే సార్" అతను భయంగా చూస్తూ అన్నాడు.

"ఇప్పుడు మరోసారి చదువు, యింకేం యిరికించాలో చెబుతాను" ప్రజా ప్రతినిధి మంత్రి రూపంలోకి మారి ప్రజల్ని మంత్రించబోతున్నాడు.

అతను మెల్లగా చదవటం ప్రారంచించాడు. అంత మత్తులోనూ ఎంతో శ్రద్ధగా విన్నారు పట్టాభి, మధుమూర్తి, సుందరమ్మ. అతను చదవటం పూర్తిచేశాడు.

"మేం ఎలక్షన్ ముందు ఇచ్చే వాగ్దానాలకన్నా స్ట్రాంగ్‌గా వుండాలి ఈ వ్యవహారం. ఇప్పుడు జత చేసుకో చెబుతాను" సుందరిని ప్రక్కకు తప్పించి శ్రద్ధగా చెప్పుకుంటూ వెళ్ళసాగాడు పట్టాభి .

"ఇంటి లోను తీసుకునేముందు ఇంటిని తాకట్టుపెట్టాలి. ఆ ఇంటి ప్లాను మున్సిపాలిటీగాని, లోకల్ అథారిటీస్‌గాని అప్రూవ్ చెయ్యాలి. ఇన్సూరెన్స్ పాలసీలు కేంద్ర ఆర్థిక శాఖ నిబంధనలకు లోబడివుంటాయి. బ్రాకెట్‌లో మెస్సర్స్ కంపెని డిస్‌క్రిషన్
అని వుండాలి.

మా 36 వేల సిబ్బంది ధృడదీక్ష శ్రమ, సంకల్పబలమే మీకు మాకు శ్రీరామరక్ష. కంపెనీ టేక్స్ ది రెస్పాన్స్‌బిలిటీ ఆఫ్ గివింగ్ ది హండ్రెడ్ పర్సెంట్ ఎస్యూరెన్స్ దట్ ది ఎంటైర్ ఎమౌంట్ పెయిడ్ బైది మెంబర్స్ గ్యారంటీడ్ ఫర్ రీపేమెంట్ త్రూ ది రిజర్వ్‌బ్యాంక్ ఆఫ్ ఇండియా అండ్ అదర్ షెడ్యూల్ బ్యాంక్స్.

వెహికల్ లోన్ తీసుకోదల్చినవారు కనీసం 25శాతం గ్యారంటి యివ్వాలి. వాటి ఇన్సూరెన్స్ మా కంపెనీలోనే చేయించుకోవాలి. ప్రతినెలా ఆ వెహికల్ మీద వాయిదా చెల్లించి వెళ్ళాలి. ఇది మిమ్మల్ని శంకించటంగాదు మా జాగ్రత్త కోసం.

ప్రపంచ విహారయాత్ర పథకంలో చేరదల్చుకున్నవారు ఇన్‌కమ్‌టాక్స్ డిపార్ట్‌మెంట్ నుంచి క్లియరెన్స్ పొంది వుండాలి. ప్రపంచ ఆరోగ్య సూత్రాల నిబంధనలకు లోబడి వుండాలి.

రిటైర్‌మెంట్ డిపాజిట్ పథకం రిజర్వుబ్యాంకు రూల్స్‌కు లోబడి వుంటుంది. రుణం కావలిసిన రైతులు విధిగా తమ పాస్‌బుక్ తమ అప్లికేషన్‌తో జతపరచవలసి వుంటుంది.

పాడిపశువుల రుణాలు తీసుకోదల్చినవారు విధిగా ప్రతినెలా మేము నియమించే పశువుల

వైద్యులతో మీపాడి గేదెల్ని ఆవుల్ని పరీక్ష చేయించుకుని వైద్య సహాయం పొందితీరాలి.

నిరుద్యోగ భద్రతా పథకంకింద చేరేవారు తమ తమ ఉద్యోగ ప్రయత్నాలలో సిన్సియర్‌గా ప్రయత్నించాలి.

పట్టాభి కొద్దిక్షణాలు చెప్పటం ఆపి మధుమూర్తి వేపు ఆనంద కుమార్ జగ్గివేపు మర్మగర్భంగా చూశాడు.

"ప్రజల్ని నమ్మించడంలో, మోసం చేయడంలో మీ రాజకీయ వేత్తల తరువాతే ఎవరయినా? ప్రతీ పథకం వెనుక కొన్ని నిబంధనలు జోడించి మన సంస్థ నూటికి నూరుశాతం మంచిదే అన్న గొప్ప నమ్మకాన్ని భలే కలిగిస్తున్నావు" అన్నాడు మధుమూర్తి తెగ సంబరపడిపోతూ.

జగ్గీ హిందీలో అడిగాడు ఏమిటి విషయం అని. అప్పటివరకూ రాసిన పథకాల్ని వాటికి పట్టాభి జోడించిన నిబంధనల్ని మధుమూర్తి హిందీలో చెప్పాడు.

"మరి రిజర్వ్ బ్యాంక్‌లో డిపాజిట్‌లు అంటున్నారు వేస్తున్నారా" సుందరి అశ్చర్యపోతూ అడిగింది.

"వేయం, కాని వేసామని చెబుతాం ఎవరికనుమానం వస్తుంది? ప్రజలకా? వారి బతుకులప వారికంత జాగ్రత్త వుంటే లాబెల్లా, ఆదిత్యా, సన్‌రైజ్, గోదావరి సేవింగ్ సిండికేట్, సుదర్శన్ చిట్‌ఫండ్, నేషనల్ ఓరియంటల్ లాంటి కంపెనీలెలా మోసం చేయగలిగాయి?

ఆశకు, ప్రలోభానికి లొంగని మధ్యతరగతి మానవుడుండడు. వారికున్న బలహీనతలమీదే మనం సొమ్ముచేసుకుంటాం. నీకు తెలుసా, ప్రజల్ని ఒకసారి కొందర్ని మోసంచేయవచ్చు. మరోసారి మరికొందర్ని మోసం చేయవచ్చు.

కాని అన్నిసార్లు అందర్ని అన్నివేళలా మోసంచేయటం అసాధ్యం అని అరిచేదెవరో తెలుసా? రాజకీయవేత్తలుగాదు. మోసపోయి, సిగ్గుపడే ఆఫ్‌నాలెడ్జి ఆవేశపరులు. చేసేదేం లేకపోయినా చైతన్యం అంటూ అరిచేవాళ్ళు వీళ్ళేం చేయరు చేయలేరు. మహా అయితే నాలుగు కవితలు ప్రాస కోసం ప్రాకుతూ రాస్తారు. ఎన్నిసార్లు అయినా అందర్నీ అన్ని వేళలా మోసం చేయటం ఈ దేశంలో చాలా తేలిక."

"నమ్మకం కలగటం కోసం ఏంచేస్తారు?" సుందరి ప్రశ్నించింది.

"ఐదులక్షలు ఒక లోకల్ నేషనలైజ్‌డ్ బ్యాంకులో డిపాజిట్ చేస్తాం. ఆ బ్యాంకులో ఉద్యోగుల్ని ఇద్దర్నీ కొనేసి కొన్ని లక్షలు అష్టలక్ష్మి ఫైనాన్స్, చిట్‌ఫండ్ ఇన్వెస్ట్‌మెంట్ కంపెనీ పేర డిపాజిట్ అయివున్నాయని పబ్లిసిటీ ఇప్పిస్తాం. ఆ తరువాత నేనే దాన్ని ఓపెన్ చేస్తాను నావెనుక పదిమంది ఎమ్మెల్యేలుంటారు.

నలుగురయిదుగురు సినిమా నటీనటుల్ని రప్పిస్తాం. ఎడ్వర్‌టైజ్‌మెంట్సు విపరీతంగా లోకల్ దినపత్రికలో, రాష్ట్ర దినపత్రికల్లో ఇస్తాం. కనుక ఆ పత్రికల రిపోర్టర్సు, వీలయితే న్యూస్ ఎడిటర్లు, రెసిడెంట్ ఎడిటర్లు కూడా ఓపెనింగ్‌కి వస్తారు.

మొదటిరోజున చేరిన చందాదారుల్ని డిపాజిటర్సుని కలిపి ఒక లాటరీ తీస్తాం. ఆ లాటరీలో గెలిచినవారికి నిజంగానే ఆన్ ది స్పాట్ మారుతీ కారు ఇస్తాం"

సుందరమ్మ "నిజంగానే" అంది ఉలిక్కిపడుతూ.

"నిజమే, కాకపోతే మధుమూర్తి మనుష్యుల్ని ప్రజలచే గుర్తించబడిన వ్యక్తులకు రాదు. అలాగే నా మనుష్యులని గుర్తించబడిన వారికి అసలు రాదు."

"అయ్యో" వాపోయింది సుందరమ్మ.

"మన మనిషి కాని ప్రపంచానికి మన మనిషని తెలీని వ్య క్తికి కాదు బహుమతిగా ఇవ్వబడుతుంది. ఇతను కారుకి మన పథకాలున్న స్టిక్కర్స్ అంటించుకుని ఇదే ఏరియాలో తరచు తిరుగుతుంటారు.

అసలిదంతా ఎందుకంటే ఆ కారు పొరపాటున ఓ పేదవాడికెళ్ళిందనుకో, వాడు దాన్ని మెయిన్‌టైన్ చేయలేడు కనుక అమ్ముకుంటాడు.

అప్పుడు మన మారుతీకారు పథకం దెబ్బతింటుంది. అదక్కడ తిరిగుతూ మన కంపెనీ మీద నమ్మకాన్ని పెంచుతూ ప్రజల్ని ప్రలోభ పెడుతూ వుండాలి. లాటరీ తీసే డబ్బాలు రెండు తయరవుతాయి" నిషాలో చెప్పుకుంటూ వెళ్తున్నాడు పట్టాభి .

0 0 0

గౌసుద్దీన్ అప్రమత్తంగా వున్నాడు. పట్టాభి మధుమూర్తి ని చట్టంనుంచి తప్పిస్తూ తనూ కోటీశ్వరుడు కావాలనుకున్న గౌసుద్దీన్ కు యుగంధర్ అడ్డు తగలటం చికాకుగా వుంది.

పొరపాటున ఐ.జి. దొర కనుక తనది, యుగంధర్‌ది పాత రికార్డుల్ని తిరగేస్తే తనకు పోస్టింగ్ రాదు. బహుశా ఇప్పుడా ఎంక్వయిరీ ఐ.జి.కి సాధ్యం కాకపోవచ్చు కాని యుగంధర్ తనకి పోటి అయ్యాడే ఎలా? యుగంధర్ కేవలం సిన్సియరేకాదు ఎత్తుకు పైఎత్తువేసి తన శత్రువుల్ని చిత్తు చేయగల మేధావి కూడా, తనకు అడ్డు తగలకుడా వూరకే వుంటాడా?

తనను అసమర్థుడిగా రుజువుచేసే ప్రయత్నం తప్పకచేస్తాడు, తను జాగ్రత్తగా వుండాలి. ఈ ఆలోచనలు మదిలో మెదులుతుండగా తన జాగ్రత్తలో తను వుంటూ మంత్రి పట్టాభిని కాంట్రాక్టులో పెట్టుకున్నాడు.

నేను మీ నియోజక వర్గానికి వస్తే మిమ్మల్ని, మీ తప్పుడు పనుల్నిచూసీ చూడనట్లు పోతాను. ఆ పోస్టులో నియమించుకోవటం మీకు, నాకు ఇద్దరికీ లాభం అని గౌసుద్దీన్ చెప్పటం. మా మనిషే మా ప్రాంతానికి రావాలి తప్ప-- మమ్మల్ని వ్యతిరేకించే వ్య క్తి వస్తే పార్టీ విరాళాల్ని నేను పోగుచేయలేనని పట్టాభి హోమ్‌మంత్రితో చెప్పటం జరిగి చాలాకాలమయింది.

ఐ.జి.దొర ఇచ్చిన గడువు మరో 36 గంటల్లో పూర్తికావస్తుంది. యుగంధర్ ఏదో చేస్తాడు...... ఏమిటిది...?

ఏ వేపునుంచి ఎలా దెబ్బ కొడతాడు? గౌసుద్దీన్ ఇక్కడ ఇలా మధనపడుతుండగా ఉదయ్ బస్ దిగాడు.

పావుగంట తేడాతో మరో బస్‌లో సర్కిల్ దిగాడు! ఇద్దరూ బస్ స్టాండ్‌లోనే కల్సుకున్నారు.

"మీ ఇంటి అడ్రస్ పట్టుకోమని నమ్మకస్తులయిన ఇద్దరు కానిస్టేబుల్స్‌ని నియమించి వచ్చాను. వెంటనే ఎందుకు వచ్చానంటే నీకు సహాయంగా వుంటానని... ఇకపోతే టైం దగ్గరకు వచ్చింది. గౌసుద్దీన్ ఇల్లు చూపిస్తాను..." అంటూ ఓ ఆటోని పిలిచాడు సర్కిల్.

ఇద్దరూ ఆటో ఎక్కగానే "నెహ్రూ నగర్" అన్నాడు సర్కిల్. ఆటో నెహ్రూ నగర్‌వేపు దూసుకుపోయింది.

"దూరంగా వుండే ఇల్లు చూపిస్తాను... లేదంటే నన్ను గౌసుద్దీన్ ఇంటిముందు సెంట్రి గుర్తుపట్టే ప్రమాదం వుంది..." సర్కిల్ నెమ్మదిగా అన్నాడు.

ఉదయ్ మౌనంగా అలాగేనన్నట్లు తలూపాడు.

బస్‌స్టాండ్ నుంచి ఆరు కిలోమీటర్లు ప్రయాణించిన ఆటో నెహ్రూనగర్ చౌరస్తాకు దగ్గరవుతుండగా "రైట్ సైడ్ సెకండ్ స్ట్రీట్" అన్నాడు సర్కిల్ ఆటోడ్రైవర్‌ని ఉద్దేశించి.

మరో నిమిషానికి సెకండ్ స్ట్రీట్ మొదట్లో ఆగింది ఆటో.

"ఈ స్ట్రీలో థర్డు హౌస్..." అన్నాడు సర్కిల్.

నిశ్శబ్దంగా ఆటోదిగి ఆ వీధిలో నడటం మొదలెట్టాడు. సర్కిల్ ఆటోలో తిరిగి చౌరస్తాలోకి తీసుకెళ్ళి, డబ్బులిచ్చేసి పంపించేశాడు.

ఉదయ్ తేలిగ్గా గుర్తుపట్టేశాడు గౌసుద్దీన్ ఇంటిని.

ఇంటి ముందు గేటు ప్రక్క చిన్న ఉడ్ కలర్ బోర్డు---దానిమీద వైట్ కలర్‌లో గౌసుద్దీన్ పేరు, హోదా స్పష్టంగా రాసివుంది.

ఇంటివేపు నడుస్తూనే పరికించి చూశాడు ఎవరికీ అనుమానం రాకుండా, ప్రక్క ప్రక్కనే చాలా ఇళ్ళున్నాయి వరుసగా.

ఇంటి ముందు గన్‌తో ఒక సెంట్రి... ఇంటి కిటికీలకు దోమలు రాకుండా మెష్‌లు బిగించి వున్నాయి. వీధి చివర వరకు వెళ్ళి మరలా వెనుతిరిగాడు.

దూరంనుంచే గౌసుద్దీన్ ఇంటివేపు పరిశీలనగా చూస్తూ ముందుకు సాగిపోయాడు. ఇంటి ప్రక్క ఇల్లు వరుసగా వున్నాయి.

జనసంచారం బాగా వుంది. వీధిలైట్లు దగ్గర దగ్గరగా వున్నాయి.

రాత్రి అవి ఒక్కసారి గుప్పుమని వెలిగితే ఆ వీధంతా వెలుతురే. చక చక నడుస్తూ గౌసుద్దీన్ ఇంటి వెనుక వీధిలో వెళ్ళాడు. అక్కడ పరిస్థితి అలాగే వుంది.

ఉదయ్ ఆలోచిస్తూనే తిరిగి చౌరస్తాలోకి వచ్చి సర్కిల్ను కలిశాడు.

సర్కిల్ ఉదయ్‌ను చూస్తూనే కనుబొమ్మలు ఎగురవేశాడు దొంగతనం చేయటం సాధ్యమేనా అన్నట్టు.